పిహెచ్‌సిని సందర్శించిన డిఎం అండ్ హెచ్‌ఓ

ప్రజాశక్తి -జిమాడుగుల: అల్లూరి జిల్లా ఆరోగ్య వైద్య శాఖ అధికారి డాక్టర్ తమర్భ విశ్వేశ్వర్ నాయుడు బుధవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి అనంతరం రోగులతో మాట్లాడారు , సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించమని వైద్య సిబ్బందికి సూచించారు. బంద వీధి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పర్యటించి మంగళవారం మరణించిన విద్యార్థిని మృతికి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్‌ఓ

హైడ్రో పవర్ ప్లాంట్‌ను నిర్మిస్తే తరిమి కొడతాం

-సిపిఎం నేతలు, ఆదివాసీల ఆందోళన- జిఒ 51 పత్రాలు దగ్ధం

ఆందోళన చేపడుతున్న సిపిఎం నేతలు గంగరాజు, వెంకన్న, ఆదివాసీలు

ప్రజాశక్తి-అనంతగిరి: అనంతగిరి మండలం పెదకోట ఏరియాలో హైడ్రో పవర్ ప్లాంట్లుకు నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన జీవో 51ను వెంటనే రద్దు చేయాలని, దీన్ని నిర్మాణం చేపడితే తరిమి కొడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, అనంతగిరి జెడ్పిటిసి దీసరి. గంగరాజు, అరకువ్యాలీ జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, అనంతగిరి మండల నాయకుడు ఎస్ నాగులు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం పెదకోట ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టే ప్రాంతాన్ని స్థానిక గిరిజనులతో కలిసి పరిశీలించారు. జీవో 51 కాపీని దగ్ధం చేశారు. జీవో వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ, గ్రామసభ, 1/70 చట్టం, పీ.స.చట్టం అటవీ హక్కులు చట్టాన్ని, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో వర్తించే వివిధ రాజ్యాంగ నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ హైడ్రో పవర్ ప్లాంట్లు అనుమతించిన తీరు తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందని తెలిపారు. పీసా చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం ఏదైనా భూసేకరణకు ముందు ప్రభుత్వం వివరణాత్మక ప్రాజెక్ట్ సమాచారాన్ని మండల ప్రజా పరిషత్‌కి సమర్పించవలెనన్నారు. ఈ సమాచారంలో సమగ్ర ప్రాజెక్ట్ రూపు రేఖలు, సామాజిక ప్రభావాలు, భూసేకరణ ప్రత్యేకతలు, కొత్త స్థిర నివాసాల గురించి సమాచారం ఉంటుందన్నారు. ప్రభావిత వర్గాలకు ప్రతి పాదిత పరిహారం వంటివి ఉండాలని తెలిపారు. అప్పుడు ఎంపిపి చట్ట బద్ధంగా ప్రభావిత గ్రామ పంచాయతీ, గ్రామ సభలతో సంప్రదించి వారి అంచనాలు, సిఫార్సులను సేకరించాలన్నారు. ఈ సంప్రదింపుల తర్వాత, ఎం.పి.పి ఈ సిఫార్సులను ఏకీకృతం చేసి, భూసేకరణ అధికారికి తుది సిఫార్సును సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎఫ్.ఆర్.ఎ లోని సెక్షన్ 4(డి) కమ్యూనిటీ అటవీ వనరులను నియంత్రించడానికి, వన్యప్రాణులు-జీవ వైవిధ్య రక్షణకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి గ్రామసభ అధికారాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. కంపెనీలైన వాటాదారులు ఈ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని నిర్దేశిస్తున్నారు. ఈ సంప్రదింపుల ప్రక్రియను పూర్తిగా దాట వేశారని తెలిపారు. దీనిపై ఇప్పటివరకు ఎటువంటి చర్చ జరగలేదన్నారు. పార దర్శకత లేదని తెలిపారు. గిరిజన సలహా మండలి (టి.ఎ.సి)లో ఈ ప్రాజెక్టులపై చర్చలు, ముందస్తు సంప్రదింపులు జరపడానికి ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. ఇప్పటికే టి.ఎ.సిని నియ మించలేదన్నారు. ప్రాజెక్టులతోఆదివాసీ తెగ జీవనోపాధిని కోల్పోయే ఆవకాశం ఉందన్నారు ఆదివాసీ భూములు పూర్తిగా బీడు బారి పోతాయని తెలిపారు. వెంటనే 51 ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెదకోట ఎంపిటిసి సిరగం శ్రావణి, సోములు చిన ఎర్రయ్య, సోముల దేముడు, నారాంగి సింహచలం ,గోల్లూరి ఆనంద్ , దేముడు గల్లూరి గోవింద్, గుంట గోవిందు, జన్ని ఈశ్వరరావు, జన్ని వెంకటరావు, గిరిజన సంఘం నాయకులు సరజే సురేష్ బాబు,కె.భాస్కర్, గిరిజనులు పాలొన్నారు.

మన్యంలో ఏకధాటిగా వర్షాలు

- కూలిన ఇంటి గోడ, ప్రహరీ -వాగు -దాటేందుకు మహిళల అవస్థలు

జి.మాడుగులలో కూలిన ఇంటి ప్రహరీ

ప్రజాశక్తి-పాడేరు:అల్పపీడనం ప్రభావంతో అల్లూరి జిల్లా అంతటా గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పగలు రాత్రి తెరిపివ్వకుండా వర్షం పడుతుంది. సోమవారం నుంచి ధాటిగా మొదలైన వర్షాలతో మన్యం తడిసి ముద్దయింది. జిల్లాలోని 22 మండలాల్లో కూడా వర్షపాతం నమోదయింది. జిల్లా అంతటా కురుస్తున్న వర్షాలతో బుధవారం జిల్లా మొత్తం వర్షపాతం 836 మిల్లీమీటర్లు జిల్లా యావరేజ్ వర్షపాతం 38 మిల్లీమీటర్ల చొప్పున నమోదు అయింది. ఈ మేరకు జిల్లాలోని కూనవరం మండలంలో87.8 మిల్లీమీటర్లు రంపచోడవరం 82.6 మిల్లీమీటర్లు అడ్డతీగల మండలంలో 80.2 మిల్లీమీటర్లు, ఎటపాక మండలంలో 72.4 మిల్లీమీటర్లు చొప్పున ఈ నాలుగు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదయింది. కాగా మిగిలిన మండలాల్లో ఓ మోస్తారుగా పడిన వర్షాల కారణంగా ముంచంగిపుట్టు మండలంలో 68.4 మిల్లీమీటర్లు, మారేడుమిల్లి 63.2, చింతూరు 45.8, గంగవరం 48.6, హుకుంపేట 42.4, జిమాడుగుల 40.8, రాజవొమ్మంగి 26.2, వరరామచంద్రపురం 24.8, అరకు వ్యాలీ 25.8, అనంతగిరి 21.6, పాడేరు 20.4, వై.రామవరం 20.2, దేవీపట్నం 18.4, పెదబయలు 17.6, చింతపల్లి 12.8, కొయ్యూరు 10.2 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదు కాగా, జీకే వీధి మండలంలో అత్యల్పంగా 2.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది.

వర్షాలతో కూలిన ఇంటి గోడ

హుకుంపేట::వర్షాలతో మండలంలోని తీగలవలస పంచాయతీకి చెందిన గుర్రాలతోట గ్రామంలో సింగన్నకు చెందిన ఇంటి గోడ తడిసి కూలి పోయింది. గోడ కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కొన్ని రోజుల క్రితమే సింగన్న భార్య అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మరణంలో మానసికంగా విలవిలలాడుతున్న సింగన్నకు, ఇప్పుడు గోడ కూలిన పోవడం మరింత కష్టాల నడుమ చిక్కుకున్నాడు. ఈ కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



హుకుంపేట మండలం గుర్రాలతోటలో కూలిన ఇంటి గోడ

చీడిపుట్టు కల్వర్ట్‌పై నీటి ప్రవాహం

హుకుంపేట:మండలంలోని చీడిపుట్టు కల్వర్ట్‌పై భారీ వర్షాలకు నీరు నిండి ప్రవహించడంతో రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రోడ్డంతా నీటితో నిండి ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ ప్రధాన రహదారిపై మండ, గడిపించమండ, బారమసి పంచాయతీలకు చెందిన ప్రజలు రోజువారి అవసరాల కోసం రాకపోకలు సాగిస్తున్నారు.కల్వర్ట్ ముంచెత్తడంతో ప్రజలు వేరే మార్గాన వెళుతున్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు అడ్డుమండ దారి మీదుగా గట్టుల మీద నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితులు వర్షాకాలంలో తలెత్తుతున్నా, అధికారుల స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

కూలిన ప్రహరీ గోడ

జి.మాడుగుల :మండల కేంద్రంలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాత ఎంఆర్‌ఓ ఆఫీస్ కాలనీలో ఓ గిరిజనుడి ఇంటిముందు నిర్మించిన ప్రహరీ గోడ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ మనుషులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. సుమారు లక్ష రూపాయలు మేర నష్టం వాటిల్లిందంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

డుంబ్రిగుడ:మండలంలో గత నాలుగు రోజుల నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం తెరిపివ్వకుండా కురుస్తుండడంతో గిరిజనులు బయటికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం తెల్లవార్లు నుంచి రాత్రి వరకు కొద్దిపాటి కూడా తెరిపివ్వకుండా జోరుగా వర్షం కురిసింది. మండల కేంద్రంలోని వీధి కాలువలన్నీ జలమయంగా మారాయి.

చింతపల్లి మండలం ఎర్రవరం వద్ద వాగులో వెళుతున్న మహిళలు

చింతపల్లి:మండలంలోని మారుమూల ఎర్రబొమ్మల, గొందిపాకల పంచాయతీల పరిధిలోని కొండల నడుమ నివసిస్తున్న ఎర్రవరం, ఎర్నాపల్లి గ్రామాల మధ్య ఉన్న పెద్ద వాగు పొంగి ప్రవహిస్తుండటంతో మహిళలు ప్రాణాలను పణంగా పెట్టి దాటుతున్నారు. ఈ వాగుకు అనుకొని ఎర్నాపల్లి, పొర్లుబంద, వంటలమామిడి, తప్పలమామిడి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 94 కుటుంబాలు నివసిస్తున్నాయని, 400 మంది జనాభా కోసం ఈ వాగు ఇప్పుడు ప్రాణ సంకటంగా మారిందని గ్రామస్థులు తెలిపారు. వాగుపై వంతెన నిర్మిస్తే ఎర్రవరం, ఎర్నాపల్లి గ్రామాలతో పాటు పరిసర మూడు గ్రామాలకు కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

పొంగిన చొంపి వంతెన.

అరకులోయ రూరల్: అరకులోయ మండలం చొంపి వంతెన పై వర్షపు నీరు పొంగి ప్రవహిస్తుంది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ప్రస్తుతం కొత్త వంతెన నిర్మిస్తున్నప్పటికీ రాకపోకలకు మరో మార్గం లేక వాహనాల రాకపోకలకు ఆటంక మేర్పడింది. అరకులోయ నుండి బోసుబెడ్డ,మాడగడ వెళ్లి నుండి మళ్ళీ తిరిగి రావాలంటే సుమారు 8 కిలోమీటర్లు ఉంటుందని,వాహనాలు రాకపోకలు దూరం అవుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నూతన వంతెన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కూనవరం: పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం అధ్వర్యంలో తహశీల్దార్ శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటి సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రతి సంవత్సరం వచ్చే వరదలకు వ్యవసాయ భూములు, నివాసముంటున్న వాళ్ల గోదావరి వరదలకు తీవ్రంగా నష్టోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి నిర్వాసితునికి సంపూర్ణ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని కానీ ప్రజలు గందరగోళంలో పడే విధంగా లేడార్ సర్వే పేరుతో 41.15 కాంటూర్ లెక్కల ప్రకారమే నిర్మాణం అంటున్నారన్నారు. 2022లో వరదలకు కేవలం 38 మీటర్ల ప్రకారం మండలం మొత్తం గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయని ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వం నిర్వాసితుల జీవితాలతో ఆటలాడుతోందని దుయ్యబట్టారు. నిర్వాసితులంతా ఐక్యమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు రూ.15 లక్షల ఆర్అండ్ఆర్ ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని, కూనవరం మండలంలోని ప్రయారిటీ గ్రామాలకు తక్షణమే పరిహారం ఇవ్వాలని కోరారు. పునర్వాసా కేంద్రానికి వెళ్లే నాటికి 18 సంవత్సరాల వచ్చిన వారందరికీ ఆర్అండ్ఆర్ ఇవ్వాలని, పోలవరం ముంపు ప్రాంత ప్రజలకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు కొర్రీ పెట్టకుండా పథకాలు ఇవ్వాలన్నారు. పునరవాసం ఇచ్చేవరకు అభివద్ధి పనులు మరియు హౌసింగ్ పథకాలు ఆపరాదని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి బాబు బోర్రయ్య, జిల్లా నాయకులు పాయం సీతారామయ్య, మడకం నాగమణి, మండల కమిటి సభ్యులు తాలూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, సిపిఎం సీనియర్ నాయకులు నానుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మిరియాల శిరీష

టిడిపి యూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జులకు శిక్షణ

ప్రజాశక్తి - రంపచోడవరం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బుధవారం రంపచోడవరంలో ఆర్‌పి ఫంక్షన్‌హాల్ లో శిక్షణ కార్యక్రమం రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు వేసిన సందర్భంగా గడిచిన ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లాలి అనే అంశంపై టిడిపి యూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలకు వివరించారు. అనంతరం ప్రభుత్వ పథకాలకు సంబంధించిన యాప్ ఏ విధంగా వినియోగించాలి ఫోటోలను ఎలా అప్‌లోడ్ చేయాలి అన్నది ప్రొగ్రాం ట్రైనర్ బాచినేని శ్రీకాంత్ వివరించారు. కార్యక్రమంలో టిడిపి మాజీ శాసనసభ్యులు చిన్నం బాబూ రమేష్, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, జిసిసి డైరెక్టర్ గొర్లెసునీత,11 మండలాలకు సంబంధించిన బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

జెడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి ఒడుగుల జ్యోతి

ప్రజల ప్రాణాలతో చెలగాటమా..!

- ఏలేశ్వరం అన్నవరం రోడ్డు బాగుచేయాలి
- జెడ్‌పి సమావేశంలో జెడ్‌పిటిసి ఒడుగుల జ్యోతి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : రహదారి వేయకుండా ప్రజల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారని రాజఒమ్మంగి జెడ్‌పిటిసి ఒడుగుల జ్యోతి అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో బుధవారం నిర్వహించిన జెడ్‌పి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుంచి జడ్డంగి అన్నవరం వరకూ రోడ్డు మంజూరై నాలుగేళ్లు అవుతున్నా కనీసం రోడ్డు వేయలేని దుస్థితి నెలకొందన్నారు. ఇదే కాంట్రాక్టర్‌కు 14 రోడ్లు ప్యాకేజి ఇవ్వడం వల్ల పనులు పూర్తి చేయలేకున్నారు. ఈ లోపం ఆర్అండ్‌బి అధికారులదా లేక కాంట్రాక్టర్‌దా తెలియజేయండి, ప్రభుత్వ అధికారులు, పాలకులు ఉన్నది ప్రజలను కాపాడటానికా లేక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటానికా చెప్పండి అని నిలదీశారు. ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా ఈ రోడ్డు కోసం ఎవరూ పట్టించుకోవడం లేదని, ఏలేశ్వరం నుండి జడ్డంగి అన్నవరం వరకు మెటల్ క్వారీలు ఉండడం భారీ వాహనాలు వెళ్లడం వల్ల కూడా రహదారి శిథిలమైంది. లారీలు వెళ్లేటప్పుడు వచ్చే దూళితో వెనుకవచ్చే వాహనచోద కులకు రోడ్డు కనిపించడం లేదన్నారు. లారీలను రాత్రి సమయాల్లో మాత్రమే తిరిగేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి బాగుచేయాలని కోరారు.

రేపు చింతపల్లిలో సిపిఐ సమితి సమావేశం

ప్రజాశక్తి - కొయ్యూరు : అల్లూరి జిల్లా చింతపల్లిలో ఈ నెల 4న భారత కమ్యూనిస్ట్ పార్టీ సమితి సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తెలిపారు. స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడ దాసరి భవన్‌లో జరిగిన సమావేశంలో మండల జిల్లా మహాసభలు త్వరితగతిన పూర్తి చేసి రాష్ట్ర మహాసభలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ సమితి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు .

విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అవస్థలు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం దారకొండ పంచాయతీ దారకొండలో తరచూ విద్యుత్ సౌకర్యం నిలిచిపోవడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షపు నీటిని డ్రమ్ములు, పాత్రల్లో నింపుకొని వినియోగిస్తున్నారు. వారం రోజుల నుంచి భారీవర్షాలతో పాటు ఈదురుగాలులు వీస్తుండడంతో చెట్టుకొమ్మలు విరిగి విద్యుత్ వైర్లుపై పడి తరచూ సాంకేతిక లోపాలు ఏర్పడుతున్నాయి. ట్రాన్స్ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బిందు సేద్యం పరికరాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు : ఏజెన్సీలో రైతులకు బిందు సేద్యం పరికరాలను మంజూరు చేయడం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ బుధవారం ప్రకటన లో తెలిపారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, ఇతర పంటలు సాగు చేసే రైతులకు సూక్ష్మ, సేద్య పరికరాలు బిందు, తుంపర సేద్య పరికరాలు రాయతీ పై ఇవ్వడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. 2025 - 26 అర్థిక సంవత్సరమునకు గాను అల్లూరి సీతారామరాజు జిల్లాకు 2000 హెక్టార్లు భౌతిక లక్ష్యంగా మంజూరు చేసినట్లు తెలిపారు. పరికరాలకు రాయితీ, (డ్రిప్ ఇరిగేషన్ / బిందు సేద్యం) వివరాలు: 5 ఎకరాలలోపు భూమి గల ఎస్సీ, ఎస్టి రైతులకు 100 శాతం రాయితీ, 5 నుంచి 10 ఎకరాల పైబడి భూమి గల ఎస్సీ, ఎస్టి రైతులకు 90 శాతం, 5 ఎకరాలలోపు భూమి గల ఇతర రైతులకు 90, 5 నుంచి 10 ఎకరాల పైబడి భూమి గల ఇతర రైతులకు 70 శాతం, 12.5 ఎకరాల పైబడి భూమి గల రైతులకు 50 శాతం రాయితీ పై డ్రిప్ పరికరాలు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. తుంపర్ల సేద్యం (స్ప్రింక్లర్ ఇరిగేషన్): చిన్న, మధ్య తరహా, ఇతర రైతులకు 50 శాతం రాయితీ పై స్ప్రింక్లర్ సెట్స్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. బోరు, బావి ఉన్న ప్రతి రైతు తక్కువ నీటితో, అధిక దిగుబడితో నాణ్యమైన ఉత్పత్తి సాదించాలనుకుంటే సూక్ష్మ సేద్యం చేయాలన్నారు. సూక్ష్మ సేద్యంతో సాగు ఖర్చు తగ్గించడమే కాకుండా అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తి, అధిక నికర ఆదాయం పొందవచ్చునని సూచించారు. జిల్లాలో రైతులు ఆధార్, వన్ బి, బ్యాంకు పాసు బుక్, ఎస్సీ ఎస్టి రైతులు, కుల ధ్రువీకరణ పత్రము, ఫోన్ నెంబర్ వివరాలతో సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏడు సంవత్సరాల క్రితం సూక్ష్మ సేద్యం పరికరాలు రాయితీ పై తీసుకున్న రైతులు మరల ఈ సంవత్సరము రాయితీ పై బిందు సేద్య పరికరాలు పొందవచ్చున్నారు. మరిన్ని వివరాలకు జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ ఎ.బి.రాజశేఖరం(7995087036), మైక్రోఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారిణి పి.ధారలక్ష్మి (9553443946) సంబంధిత ఉద్యాన అధికారులను సంప్రదించాలన్నారు.

పాఠశాలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలో పినకోట పంచాయతీ సొలుబొంగి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ సెంటర్ పాఠశాల ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం ఎట్టకేలకు ప్రారంభయిన విషయం తెలిసిందే. అల్లురి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కనల. చిరంజీవి నాగ వెంకట సాహిత్ బుధవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ, గ్రామానికి రోడ్డు, పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. స్పెషల్ విద్యా వాలంటరీ నియమించడం జరిగిందన్నారు. విద్యార్థులంతా రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని బంధవీధి జి టి డబ్ల్యూఏ గర్ల్స్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని మర్రి లక్ష్మి మృతిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్ డిమాండ్. చేశారు ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, విద్యార్థిని బాత్రూముకి వెళ్లి వస్తూ కాలుజారి పడిపోయి మరణించిందని పాఠశాల యజమాన్యం చెప్పారన్నారు. కాలుజారి పడి మరణించిన లక్ష్మికి ఎటువంటి దెబ్బలు తగలకుండా మరణించడం పలు అనుమానాలకు దారి తీస్తుందన్నారు. సమగ్ర విచారణ జరిపించి నిజా నిజాలు నిగ్గు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం 30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

అన్నీ ఉన్నా..అయ్యవార్లు లేరు..

- పెట్రాయి జిపిఎస్‌డబ్ల్యూ పాఠశాలలో లేని ఉపాధ్యాయులు
- కౌన్సెలింగ్ పూర్తయినా నియామకం లేదు..
- బూసికొండ పాఠశాలదీ అదే దుస్థితి

'అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని' అన్న చందాన ఉంది పెట్రాయి, బూసికొండ పాఠశాలల దుస్థితి. పాఠశాల ఉంది, చదువుకోడానికి పిల్లలు ఉన్నారు. కానీ ఉపాధ్యాయులు లేరు.. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను నియమించండి మహాప్రభో అని వేడుకుంటున్నారు.ఇదీ మన విద్యావ్యవస్థ దుస్థితి.

పెట్రాయి పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని వేడుకుంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

శిథిలావస్థలో ఉన్న పెట్రాయి పాఠశాల భవనాలు

ప్రజాశక్తి - సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం దారకొండ పంచాయితీ పెట్రాయి జిపిఎస్‌టిడబ్ల్యూ పాఠశాలకు జూన్ 12 నుంచి ఇప్పటివరకూ ఇక్కడ ఉపాధ్యాయులను నియమించలేదు. ఇక్కడ ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. 45 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకునేందుకు వచ్చారు. కౌన్సిలింగ్ పూర్తయినప్పటికీ తమ పాఠశాలకి ఉపాధ్యాయులను నియమించకపోవడంతో బుధవారం ఆందోళన నిర్వహించారు. పాఠశాల కూడా శిథిలావస్థకు చేరుకుందని వాపోయారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కవర్ల భగవాన్, గిరిజన సమైక్య మండల అధ్యక్షుడు పాంగి నాగేశ్వరరావు, వార్డు మెంబరు బలరాం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బూసికొండ పాఠశాలలోనూ ఉపాధ్యాయులు లేరు..

జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బూసికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల జూన్ 12 నుంచి ఇప్పటివరకూ తెరవలేదు. దీంతో విద్యార్థులు ఇతర పాఠశాలకు వలసబాట పట్టారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. సుమారు 40 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ క్రమంలో టిఆర్సి, పార్వతీ నగర్ గ్రామానికి చెందిన విద్యార్థులు సీలేరు ప్రైవేట్ పాఠశాలలో చేరిపోతున్నారు. ఫీజులు చెల్లించే స్తోమత లేక ప్రభుత్వ పాఠశాలలో చదివిద్దామంటే అక్కడ ఉపాధ్యాయులే లేకపోవడంతో చేసేది లేక ప్రైవేట్‌పాఠశాలల్లో చేర్పించారు. గత యేడాది ఐటిడిఎ కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించిన ఉపాధ్యాయుడు దామోదరం ఇటీవల కౌన్సిలింగ్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా కించు మండలానికి బదిలీ అయ్యారు. దీంతో ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక బోసిపోయింది.

నిర్మానుష్యంగా ఉన్న బూసికొండ ప్రాథమిక పాఠశాల

ఉపాధి హామీ పిసి రాజారావుపై దర్యాప్తు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : ఉపాధి హామీ పిసి రాజారావుపై ఉపాధి హామీ మేట్లు, వేతనదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం రాజవొమ్మంగి మండల ఉపాధి హామీ కార్యాలయంలో పిడి ఆదేశాల మేరకు విచారణ నిర్వహించేందుకు వచ్చినట్లు చింతపల్లి ఎపిడి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పిసిపై 12 అంశాలతో తమకు ఫిర్యాదు వచ్చిందని ఉపాధి హామీ పిడి ఆదేశాల మేరకు రాజవొమ్మంగి స్థానిక ఎంపిడిఒ, ఎంపిపి ఉపాధి హామీ వేతనదారుల సమక్షంలో అతనిపై వచ్చిన అభియోగాలపై దర్యాప్తు నిర్వహించాలని ఇదే అంశంపై అతనిపై గతంలో స్థానిక ఎంపిడిఒ కూడా ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారని, రాజమంగి ఎంపిపి కూడా ఫిర్యాదు చేశారని, దీనిపై దర్యాప్తు నిర్వహించి నివేదికను పిడికి సమర్పించినట్లు తెలిపారు.

మీడియాకి వివరాలు తెలుపుతున్న చింతపల్లి ఎపిడి

జిఎస్‌టి, రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయాలి

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిఎస్టి, రెవెన్యూ వసూలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ వై కిరణ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరిశ్రమలు, పంచాయతి రాజ్, పర్యాటక శాఖలు వాణిజ్య పన్నుల శాఖలతో సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో సంబంధిత శాఖల సమన్వయంతో డేటా సేకరించి తనిఖీలు చేపట్టి టార్గెట్స్ అధిగమించాలన్నారు. జిల్లా, మండల అధికారులందరికి టి.డి.ఎస్ నిర్వహణపై ఒక సమావేశం నిర్వహించాలని డిటిఓకి సూచించారు. రాష్ట్ర వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రెవెన్యూ వసూళ్ల మరింత ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. జీఎస్టీ పరిధి వలయానికి వెలుపల ఉన్న వారిని పన్నుల పరిధిలోకి తీసుకురావడానికి వీలుగా జిల్లా పరిశ్రమల శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పాత బకాయిదారులను తక్షణమే గుర్తించాలని, జిల్లాలో సేవల పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, బకాయిదారుల ఆస్తులను గుర్తించడంలో జీఎస్టీ అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయి కార్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తొలిత వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ వై కిరణ్ కుమార్ నేటికీ జిల్లాలో చేపడుతున్న పనులకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఉప కమిషనర్ అపర్ణ, అసిస్టెంట్ కమీషనర్ టి. రమేష్ కుమార్ రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ కె రమేష్ కుమార్, డ్వామా పి.డి విద్యాసాగర్, ఆర్అండ్బి ఇఇ బాలసుందర బాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కె వేణుగోపాల్, జిల్లా పర్యాటక అధికారి, లీడ్ బ్యాంకు మేనేజర్, ఎంపీడీఓలు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నియంత్రణకు ప్రత్యేక చర్యలు

రికార్డులు పరిశీలిస్తున్న కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-చింతపల్లి: కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ చైతన్య వంతంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని అల్లూరి జిల్లా ప్రోగ్రాం మేనేజ్మెంట్, జిల్లా కుష్టు వ్యాధి అధికారి ఎం. కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని లోతుగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందంగా మెరిసే జిడ్డుగల చర్మం, నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు.రోగులకు ల్యాబ్ టెక్నీషియన్ పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు పరీక్షలు జరిపి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎండిటి మందులు ఉచితంగా అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు జానకి, శివ ప్రసాద్, ఫార్మసిస్ట్ సుధారాణి, చింతపల్లి క్షయ వ్యాధి యూనిట్ ఎస్.టి.ఎస్. ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎస్సై నాయుడు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కళాశాలలో విద్యార్థినిలు, మహిళలు, బాలికలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలుపై అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది అప్పలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన విస్తృత ప్రచారం

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు: కేంద్రంలో పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం కార్మికులను ఉక్కుపాదంతో అణగదొక్కేందుకే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని, ఇందుకు అందరూ ఐక్యం కావాలని కార్మిక వర్గాలకు సిఐటియు అల్లూరు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం సిఐటియు కార్యాలయంలో విలేకరులు సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎల్ సుందర్ రావు మాట్లాడుతూ. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె చారిత్రాత్మకమైందని కార్మికులకు అంతా ఒక తాటిపై కొచ్చి పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి మోడీ నాయకత్వం దేశంలో ఉన్న ప్రభుత్వ రంగాన్ని పెట్టుబడిదారులకు తన అనుచరులకు కట్టపెట్టాలని, తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగం ప్రైవేటుపరమైతే పేద వర్గాలకు, శ్రామికులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై గత రెండు సంవత్సరాలుగా పెద్ద ఎత్తున కార్మిక వర్గం ఐక్యంగా పోరాడుతున్నా కనీసం కేంద్ర ప్రభుత్వానికి మానవత్వం కూడా లేదని విమర్శించారు. పైగా కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగించారని తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఫారెస్ట్, ఐటిడిఏ, టూరిజం, మెడికల్ అండ్ హెల్త్, సమగ్ర శిక్ష, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ వర్కర్స్ ఏపీ టూరిజం, ఇతర ప్రభుత్వ కార్యాలయంలో వేలాదిమంది కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీ వేజ్ పేరుతో పని చేస్తున్నారని, మీరందరికీ కనీస వేతనాలు రూ.26000 చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు, ఆటో మోటార్, ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లు, అంగన్వాడి ఆశ, మిడ్ డే మీల్స్, ఐకెపి కార్మికులు సమ్మెను విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసేవరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

అనంతగిరి: ఈనెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ కిల్లో. మోస్య, బొర్ర కేవ్స్ పిలుపునిచ్చారు. గైడ్ సెక్యూరిటీ కార్మికులకు, ములియగుడ ఆటో కార్మికులకు సమ్మె కరపత్రాలు పంపిణీ చేసిన అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులు అందరూ కలిసి కట్టుగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గైడ్ యూనియన్ నాయకులు కిల్లో. సోమేష్ నాగేష్, ఆటో కార్మికులు సింహాద్రి .బాలరాజు, ప్రసాద్. తదితరులు పాల్గొన్నారు

బొర్రాగుహలు వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

జిసిసి చైర్మన్ శ్రావణ్ కుమార్

పాడేరులో పథకాలపై వివరిస్తున్న కిడారి, గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని మాజీమంత్రి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని కుమ్మరిపుట్టులో మాజీ ఎమ్మెల్యే, టిడిపి పాడేరు ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో జిసిసి చైర్మన్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పేదవర్గాలకు రాష్ట్రంలో పంపిణీ చేస్తున్నంత పింఛన్ దేశంలో మరెక్కడ లేదన్న విషయంతో పాటు పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకూ వెళ్లి అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలుపర్తి గోవింద్ మాస్టర్, బొర్రా నాగరాజు, పాండు, విజయరాణి, రమణ, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయరూరల్: ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనిని ఇంటింటా వివరిద్దామని తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు.సుపరిపాలనకు తొలి అడుగు డోర్ టు డోర్ శిక్షణ కార్యక్రమం అరకులోయ మండల కేంద్రంలోని టిటిడి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో శ్రేణులను ఉద్దేశించి దొన్ను దొర మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందే తెలుగుదేశం ప్రభుత్వమని ఆయన తెలిపారు.గతంలో చంద్రబాబు నాయుడు అమలు చేసిన సంక్షేమ పథకాల్లో 70 పథకాలను జగన్మోహన్ రెడ్డి రద్దు చేశారన్నారు. ప్రభుత్వం చేసిన మంచి పనిని ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే 2019లో మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి వచ్చి ఉండేదన్నారు. దాన్ని అనుభవంగా తీసుకొని అటువంటి పరిస్థితులు మళ్లీ ఎదురు కాకుండా ఉండేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి పనిని ప్రతి ఇంటికి తిరిగి వివరించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సోవెరీ సుబ్బారావు, లోకోయి మహాదేవ్, కిల్లో ఆనంద్ రావు, శతక బొంజు బాబు, వెచ్చంగి కొండయ్య, కిల్లో సన్యాసమ్మ, సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, మాజీ ఎంపీటీసీ బోరిబోరి లక్ష్మి, మాజీ మండల అధ్యక్షుడు కిల్లో బలరాం.పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అరకు ఇన్‌ఛార్జి దొన్ను దొర

పాఠశాల భవనం మంజూరుకు కృషి

తాత్కాలికంగా అంగన్‌వాడీ కేంద్రానికి విద్యార్థుల తరలింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన
పాఠశాల భవనం పరిశీలనకు వచ్చిన అధికారులు

ప్రజాశక్తి,జి.కేవీధి: మండలంలోని దేవరపల్లి పంచాయతీ మంగళపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జీకే విధి మండలం ఎటిడబ్ల్యూఓ బి.జయ నాగలక్ష్మి, స్కూల్ కాంప్లెక్స్ డిడిఓ సుమిత్ర సందర్శించారు. కొత్త భవనం మంజూరు అయ్యే వరకు ప్రత్యాయంగా స్థానిక అంగన్వాడి కేంద్రంలో స్కూలు నిర్వహించడం కోసం మాట్లాడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రాథమిక ఉపాధ్యాయులు పి గిరిబాబు స్కూల్ చైర్మన్ గడుతూరి సత్యనారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌కు ప్రమాదం

రోడ్డు పక్కకు ఒరిగిన అంబులెన్స్

ప్రజాశక్తి -హుకుంపేట: బాకూరు నుంచి హుకుంపేటకు పేషెంట్లను తీసుకొస్తున్న 108 అంబులెన్స్ నడిమి వీధి సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయే అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో అంబులెన్స్ పైలెట్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. అప్రమత్తమైన అంబులెన్స్ సిబ్బంది ప్రాణాలతో బయటపడగా, వాహనంలో ఉన్న రోగులను వెంటనే మరో 108 అంబులెన్స్ ద్వారా హుకుంపేటకు భద్రంగా తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయ సహకారాలు అందించారు. డ్రైవర్ పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

'గుడ్‌టచ్, బ్యాడ్ టచ్'పై అవగాహన

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని బీంపోలు బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై స్థానిక ఎస్సై డి శ్రీనివాస్ బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతోనే విద్యా బోధన చేయాలని సూచించారు. చెదువుకునే దశలో చెడుమార్గంలోకి వెళ్ళవద్దని, ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తేవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ట్రైనింగ్ ఎస్ఐలు నాగమణి, రాజేశ్వరి పాల్గొన్నారు

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి తదితరులు

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యం

ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దరాజు ఆధ్వర్యంలో మండలంలోని శరభవరం పంచాయతీ వనకరాయి, అప్పన్నపాలెం, శరభవరం గ్రామాల్లో ఇంటింటికి పర్యటించారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న కుటుంబాలను కలిసి కూటమి ప్రభుత్వం గత ఏడాది పాలనలో అమలు చేసిన పథకాలను వివరించారు. కూటమి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు అందుకున్న ప్రతి లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారని తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ లోతా లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్, జిసిసి డైరెక్టర్ గొర్లె సునీత, టిడిపి నేతలు ముప్పన డింబకేశ్వరరావు, ఎం.మోహన్, పి.సత్తిబాబు, జె.మధు, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఖోఖోలో మొదటి స్థానంలో రాజఒమ్మంగి విద్యార్థులు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 41 మంది సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ యూనివర్సిటీలో జూన్ 22 నుంచి జూలై 1 వరకు18 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో మేజర్ మహ్మద్ ఆసిఫ్ సార్యద్యంలో జరిగిన ఎన్‌సిసి వార్షిక శిక్షణ శిబిరంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి ఖోఖోలో ప్రథమ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి, పిఎంసి చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ప్రతిభకు కారకులైన ఎన్‌సిసి కేర్ టేకర్ సి.హెచ్.శివకృష్ణని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.బొజ్జయ్య, ఎంకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్‌ను కలిసిన 'పంచకర్ల'

కమిషనర్ కేతన్‌గార్గ్‌తో పంచకర్ల

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: మహావిశాఖపట్నం నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేతన్‌గార్గ్‌ను జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారిరువురూ విశాఖ నగర అభివృద్ధిపై, మౌలిక వసతులు, అందించే సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించుకున్నారు.

విశాఖలో అంతర్జాతీయ స్థాయి టూరిజం ప్రాజెక్టులు

పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌జైన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశాఖపట్టణంలో టూరిజం ప్రాజెక్టుల రూపకల్పన జరగాలని, భవిష్యత్తులో నిర్వహించబోయే ప్రతిష్టాత్మక కార్యక్రమాల నిమిత్తం స్టార్‌రేటింగ్ కలిగిన 10 వేల రూములు అందుబాటులోకి రావాల్సి ఉందని రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన ఆయన విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తొలుత ఉమ్మడి జిల్లాల్లో చేపట్టబోయే టూరిజం ప్రాజెక్టులపై సమీక్షించి తగిన సూచనలు చేశారు. విజయనగరం జిల్లా భోగాపురం మండల పరిధిలో నిర్మించబోయే ఒబెరాయ్ హోటల్, విశాఖపట్టణం జిల్లా భీమిలి మండల పరిధిలోని అన్నవరంలో నిర్మించబోయే 'మై ఫెయిర్స్ హోటల్' నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని, నిర్ణీత సమయంలోగా ఆయా కంపెనీలకు భూమిని అందజేయాలని ఉమ్మడి జిల్లాల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కనెక్టింగ్ రోడ్లను వేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. గోస్తనీ నది నుంచి పైప్‌లైన్ల ద్వారా ఆయా హోటళ్ల తాగునీటి అవసరాలకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ ప్రక్రియ, ఇతర సాంకేతిక అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇతర అంశాల్లో ఆయా కంపెనీల యాజమాన్యాలకు నిబంధన లకు అనుగుణంగా ఉమ్మడి జిల్లాల అధికారులు పూర్తి సహాయ, సహకారా లు అందించాలని సూచించారు. అనంతరం విశాఖపట్టణం జిల్లాలో చేపట్టబోయే టూరిజం ప్రాజెక్టులు, పర్యాటకశాఖ పరిధిలో ఉన్న భూముల క్రమబద్ధీకరణ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్తులో వినూత్నరీతిలో పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రాజెక్టులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగర పరిధిలోకి వచ్చే పర్యాటకులకు స్థానిక టూరిస్ట్ స్పాట్లు తెలిసేలా విరివిగా హోర్డింగులు పెట్టాలని, ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అడ్వెంచర్, వాటర్ స్పోర్ట్స్, క్రూయిజ్, ఇతర విభిన్న టూరిజం ప్రాజెక్టుల గురించి అధికార యంత్రాంగం వినూత్నరీతిలో చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. పర్యాటకుల సంఖ్య పెరిగేలా, స్థానికంగా ఎక్కువ రోజులు గడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో భాగంగా ఆర్‌కె బీచ్, రుషికొండ, మధురవాడ, భీమిలి, కాపులుప్పాడ, దబ్బంద, ఎండాడ, యారాడ తదితర ప్రాంతాల్లో చేపట్టబోయే ప్రాజెక్టులపై, భూసేకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ స్పెషల్ సిఎస్‌కు వివరించారు. సమావేశంలో విశాఖపట్టణం జిల్లా కలెక్టర్‌తో పాటు, విఎంఆర్‌డిఎ కమిషనర్ కె.విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, విజయనగరం జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, ఒబెరాయ్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధ వార్షిక విక్రయాల్లో స్కోడా ఆటో రికార్డు

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ స్కోడా ఆటో ఇండియా 2024 మొదటి అర్ధభాగం కంటే ఈ ఏడాది మొదటి అర్ధభాగంలో రికార్డ్ స్థాయిలో 134 శాతం వద్ధిని నమోదు చేసిందని సంస్థ బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్‌గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా విశాఖలోని స్కోడా ఆటో షోరూంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ రికార్డుస్థాయి అమ్మకాలతో దేశంలో టాప్ ఏడో స్థానానికి తమ సంస్థ చేరుకుందని ఆయన తెలిపారు. స్కోడాఆటో 130 సంవత్సరాలుగా సేవలందిస్తోందని దేశంలో 25 ఏళ్లుగా తమ వాహనాల అమ్మకాలు జరుగుతున్నాయని గడిచిన 25 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక అర్ధవార్షిక అమ్మకాలు జరిగాయన్నారు.

5 న మెగా క్యాంపస్ డ్రైవ్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మిలీనియం సొల్యూషన్స్ మేనేజర్ రవికుమార్

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: డిజిటల్ పరివర్తనకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా భారతీయ సాఫ్ట్‌వేర్ మార్కెట్ గణనీయమైన వద్ధిని సాధిస్తోందని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ అన్నారు. విశాఖపట్నం మిలీనియం సాఫ్ట్‌వేర్ క్యాంపస్‌లో డ్రైవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు, సేవలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ రానున్న కాలంలో మరింత పెరుగుతుందన్నారు. వీటిలో ప్రధానంగా ఎఐ , క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ పరివర్తన వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విశాఖపట్నంలోని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్‌తో మెగా క్యాంపస్ డ్రైవ్‌ను ఈ నెల 5న మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో నిర్వహిస్తామని ప్రకటించారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఇన్-హౌస్ శిక్షణ నుండి నైపుణ్యం కలిగిన అభ్యర్థులను తయారు చేయడంలో సాధించిన ట్రాక్ రికార్డ్ దృష్ట్యా, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ల కోసం తమతో ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆయన అన్నారు. మెకానికల్ ,సివిల్ విభాగాలకు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లను నిర్వహించడానికి మిలీనియం ప్రఖ్యాత కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంటుందని కూడా ఆయన తెలిపారు. 2022, 2023 2024 విద్యా సంవత్సరం నుంచి సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో పరిజ్ఞానం మరియు మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగిన గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ క్యాంపస్ డ్రైవ్‌కు అర్హులు అని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ హెచ్ ఆర్ మేనేజర్ దివ్యజ్యోతి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జూలై 5న ద్వారకానగర్‌లోని క్యాంపస్‌కు నేరుగా హాజరవ్వాలన్నారు. లేదా వారి రెజ్యూమ్‌లను hr@millenniumsoftsol.com కు పంపవచ్చని ఆమె ప్రకటించారు. డ్రైవ్‌కు ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని, గరిష్టంగా విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు వారి వెబ్‌సైట్ www.millenniumsoft-sol.com ని లేదా 9248753098 నంబర్‌లో సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ కె.దివ్య, కౌన్సిలర్ కె.భవాని, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు బయట నిరీక్షిస్తున్న ఖాతాదారులు

బ్యాంకు సర్వర్లు పనిచేయక వినియోగదారుల ఇక్కట్లు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: స్థానికంగా బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ లేకపోవడంతో స్థానిక యూనియన్ బ్యాంక్ సర్వర్లు పనిచేయకపోవడంతో బుధవారం యూనియన్ బ్యాంక్ వినియోగదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఇటీవల తరచూ బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు అంతరాయం ఏర్పడడంతో సర్వర్లు పనిచేయక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాజవొమ్మంగిలో యూనియన్ బ్యాంక్ ఒకటే కావడంతో ఈ బ్యాంకు మీద 19 పంచాయతీలకు చెందిన వేలాదిమంది ఖాతాదారులు ఆధార పడ్డారు. బుధవారం బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ లేకపోవడంతో బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. పెన్షనర్లు, వద్ధులు, మహిళలు, రైతులుఉదయం 10 గంటల నుండి సుమారు సాయంత్రం నాలుగు గంటల వరకు బ్యాంకు వద్ద పడిగాపులు కాసి, వర్షంలోనూ నిరీక్షించి, నిరాశతో వెనుదిరిగారు.ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణవర్మ డిమాండ్ చేశారు.

ఐసిఐసిఐ మార్కెట్ లింక్డ్ పథకం ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కస్టమర్లు దీర్ఘకాలంలో సంపదను పెంచుకోవడానికి వీలుగా రూపొందించిన మార్కెట్ లింక్డ్ పథకం ఐసిఐసిఐ ప్రుస్మార్ట్ ఇన్సూరెన్స్ ప్లాన్ ప్లస్‌ను విడుదల చేసిందని సంస్థ చీఫ్ ప్రొడక్ట్ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పాల్టా తెలిపారు. ఒక హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ పథకాన్ని కేవలం రూ.1000 నెలవారీ ప్రీమియంతో కొనుగోలు చేయవచ్చని, తమ దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి ఇది వీలు కల్పిస్తుందని తెలిపారు. ఈ ఉత్పత్తిలోని జీవిత కవరేజీ భాగం కస్టమర్ కుటుంబం ఆర్థికంగా సురక్షితంగా ఉందని నిర్ధారిస్తుందన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు సత్వరమే ప్రారంభించాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ప్రథమ సంవత్సరం డిగ్రీ అడ్మిషన్లను త్వరితగతిన ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ, మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఎదుట ప్రగతిశీల ప్రజాస్వామ్యవిద్యార్థి సంస్థ (పిడిఎస్ఓ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిడిఎస్ఓ విశాఖ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై 20 రోజులు గడిచినప్పటికీ డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు సంబంధించి ఎటువంటి నోటిఫికేషన్ రాలేదన్నారు. సాధారణ డిగ్రీ అడ్మిషన్లు ఆలస్యం అవుతుండటం వలన విద్యార్థులు ఇతర కోర్సుల వైపు మొగ్గు చూపాల్సి వస్తోంది. దీని వలనే ప్రతి సంవత్సరం డిగ్రీలో జాయిన్ అవుతున్న వారి సంఖ్య తగ్గుతూ వస్తోందన్నారు. మన రాష్ట్రంలో సుమారు నాలుగున్నర లక్షల డిగ్రీ సీట్లు ఉండగా, అందులో కనీసంగా 50 శాతం సీట్లు కూడా కిందటి సంవత్సరం నిండక పోవటమే దీనికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్ఓ విశాఖ జిల్లా కమిటి సభ్యులు లక్ష్మణ్, సతీష్, యమున పాల్గొన్నారు.

9న జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు జరగనున్న సమావేశానికి, అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. జెడ్‌పిటిసిలు, ఇతర ఆహ్వానితులు సకాలంలో హాజరు కావాలని కోరారు.